ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -337 పేజీలు - 08 వెల - 04/-

ఆదివారం 2 నవంబర్ 2025

## కాశీబుగ్గ ఆలయంలో విషాదం

# తొక్కిసలాట 9 మంది మృతి





### శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం

- స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట
- ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు
- 9మంది మృతి..పలువురికి గాయాలు
- క్షతగాత్రలను ఆస్పత్రికి తరలించి చికిత్స
- ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు
- కాశీబుగ్గకు చేరుకున్న మంత్రి అచ్చన్నాయుడు

### రాయ్‌పూర్ సత్యసాయి సంజీవనీ ఆస్పత్రిని సందర్శించిన మోడీ



**రాయ్‌పూర్, నవంబర్ 01:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ సత్యసాయి సంజీవనీ ఆస్పత్రిని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. బిల్ కౌంటర్ ఊసేలేని ఆస్పత్రులుగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ సత్యసాయి సంజీవనీ ఆస్పత్రులలో ఒకటైన ఆసుపత్రి ఇది. ఈ సందర్భంగా చిన్నపిల్లల గుండె సంబంధ మిగతా2లో...

### ఎన్డీయేవి విభజన రాజకీయాలు

**సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లింపు**

**ఎన్నికల ప్రచారంలో ప్రియాంక విమర్శలు**




**పాట్నా,నవంబర్ 01:** ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్డీయే సర్కారు విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మిగతా2లో...

---

## వైకాపా ఓ పెద్ద ఫేక్ పార్టీ

**● వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా ● ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో చంద్రబాబు**



**సత్యసాయి,ఆంధ్ర ప్రగతివంబర్ 01:** వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీకి ఏమీ దొరకటం లేదని.. వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా చేశారు. శనివారం సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డిని గొడ్డలితో మిగతా2లో...




2లో

## సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు

**- మంత్రి నాదెళ్ల మనోహర్ ప్రకటన**

## తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**- కూటమి ప్రభుత్వ వైఫల్యంగా విమర్శలు**



**అమరావతి,ఆంధ్ర ప్రగతినవంబర్ 01:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విచారకరం.. మీడియాలో మిగతా2లో...

---



## దేశ బలోపేతానికి యువతదే బాధ్యత

**వేమన వర్సిటీ విద్యార్థులతో వెంకయ్యనాయుడు**

**కడప,ఆంధ్ర ప్రగతినవంబర్ 01:**నేటి యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దేశం బలోపేతం కావాలంటే, యువత తమలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవడం అత్యవసరమని చెప్పారు.

## కృత్రిమ మేధ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

- మానవమేధస్సుకు అది సరితగేది కానేకాదు
- సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రచారం తగదు
- రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులు
- అమరావతి రాజధాని రైతుల పోరాటం అద్వితీయం
- విట్ స్నాతకోత్సవంలో విశ్రాంత జస్టిస్ ఎన్‌వి రమణ



**అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 01:** కృత్రిమ మేధ వంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో న్యాయమూర్తులు ఒత్తిళ్లు, వేధింపులు ఎదుర్కొన్నారని... కొందరు బదిలీ అయ్యారని, సంబంధం లేకపోయినా



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

**- కెనడా, ఫ్రాన్స్ ప్రతినిధులకు సిఎం వినతి**

**హైదరాబాద్,ఆంధ్ర ప్రగతినవంబర్ 01:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్

# కాశీబుగ్గ ఆలయంలో విషాదం

**శ్రీకాకుళం,ఆంధ్ర ప్రగతి నవంబర్ 01:** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించా లని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించా ల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాననని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

# వైకాపా ఓ పెద్ద ఫేక్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

చంపి తనపై నెట్టేశారని ఫైర్ అయ్యారు సీఎం చంద్రబాబు. సాక్షిలో గుండెపోటు అని వస్తే తానూ నమ్మేశానని.. తానెప్పుడూ రాగద్వేషాలతో పనిచేయని స్పష్టం చేశారు. ఓ సర్కిల్ ఇనస్పెక్టర్‌ని దగ్గర పెట్టుకుని రక్తం పడిన గదిని కడిగేశారని... ఆధారాలు చెరిపేశారని విమర్శించారు. వివేకా కుమార్తె ఫిర్యాదు చేసిన తర్వాత అప్పుడు గొడ్డలి పోటని ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. వివేకా హత్య ఘటనలో ఏమరుపాటుకు గురయ్యామని చెప్పుకొచ్చారు. కోడికత్తి డ్రామా, గులకరాయి డ్రామాలు ఆడారని విమర్శించారు. అలాంటి వాళ్లకు రాజకీయాలు చేసేందుకు అర్హత ఉందా..? అసలు వారికి పార్టీగా ఉండే అర్హత ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని అనుకుంటే ఎంతటి వారినైనా ఢీ కొంటానని స్పష్టం చేశారు. రాయలసీమ ఫ్యాక్షన్‌ను, హైదరాబాద్‌లో మత విద్వేషాలు, నక్సల్స్ సమస్యనూ అణచివేశానని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు.అందుకే నక్సల్స్ అలిపిరిలో తనపై క్లైమోర్‌మైన్స్ పేల్చారని చెప్పుకొచ్చారు. నేరస్తులే రాజకీయ పార్టీ పెట్టి రాజకీయ అండతో నేరాలు చేస్తూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్నూలులో బస్సు దగ్ధం ఘటన జరిగితే అందులోనూ ఫేక్ ప్రచారాలకు తెరదీశారని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఒడిశాలో బస్సు రిజిస్ట్రేషన్ చేసి హైదరాబాద్ నుంచి బెంగుళూరు మధ్య నడుపుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రమాదం జరిగితే దానిపై కూడా ఫేక్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఫేక్ వ్యక్తులు దుష్పచారం చేస్తుంటే ప్రతీ రోజూ చెప్పుకోవాలా..? అని ఆగ్రహించారు. వైసీపీకి ఓ పాంప్లెట్ ఉందని... ఓ ఛానల్ కూడా ఉందని... కానీ ఆ వ్యక్తులు బయటకు వచ్చి తమకు ఛానల్ లేదని, పేపర్ లేదని ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు.వాహనాల రిజిస్ట్రేషన్ల అంశంపైనా కేంద్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. పేపర్, ఛానల్ ద్వారా శవరాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మరో ఘటనలో కమ్మ కాపు మధ్య కుల విద్వేషాలు రగిల్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వాళ్లు నిద్రలేస్తే చాలు దుష్ప్రచారానికి తెగబడుతూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి రోజూ తమ ప్రభుత్వంపై బురద వేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇక ఏమాత్రం ఉపేక్షించబోనని... అడుగడుగునా సీసీ కెమెరాలు, ఆధారాలు ఉన్నాయని... అన్నిటినీ బయటపెడతామని హెచ్చరించారు. అమాయకులను మోసం చేస్తూ కులం, మతం, ప్రాంతం పేరుతో జగన్ అండ్ కో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కృత్రిమ మేధ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కుట్రలకు బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. బాధ్యతగా పని చేయటం కూడా కొన్నిసార్లు వ్యక్తిగతమైన బాధగా మిగిలిపోతుందన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన రైతులకు న్యాయం చేసే క్రమంలో న్యాయమూర్తులు కూడా ఇబ్బందులకు గురయ్యారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అలాంటి క్లిష్ట సందర్భాల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేశారని గుర్తు చేశారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ .. యూనివర్సిటీలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ వంటి సాంకేతికత మనుషులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోదని అభిప్రాయపడ్డారు. ఎంఐటీ తాజా అధ్యయనం ప్రకారం, జనరేటివ్ ఏఐను తమ వ్యాపారాల్లో ప్రవేశపెట్టిన సంస్థల్లో 95 శాతం విఫలమయ్యాయని.. 5 శాతం సంస్థలు మాత్రమే ఆదాయం పెంచుకున్నాయని తెలిపారు. కృత్రిమ మేధస్సు అనేది మానవ మేధస్సుకు ఒక సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు. పూర్తిగా ఏఐ మీద ఆధారపడితే మానవ ఆలోచనా శక్తిని కోల్పోతామన్నారు. కృత్రిమ మేధస్సును భావోద్వేగాలతో సమతుల్యం చేయకుంటే మానవ జీవితం, గౌరవం కూడా వస్తువులా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక రాజధాని అమరావతి గురించి మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి ప్రాంతమంతా తనకు పరిచయమేనని.. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో కృష్ణా నదిలో ఉన్న దీవుల్లో రహస్య సమావేశాలు నిర్వహించిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ గడ్డ తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఎన్నో పాఠాలు నేర్పిందని... ఇక్కడి ప్రజల నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతానని తెలిపారు. రాజధానిని నిలబెట్టుకోవటం కోసం ఈ ప్రాంత రైతులు చేసిన పోరాటాన్ని జస్టిస్ రమణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారసత్వంగా వచ్చిన భూమిని రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు... అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రో÷-డడెక్కారని, పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అమరావతి వీధుల్లో జరిగిన ఉద్యమం స్వాతంత్య్రం తర్వాత దక్షిణ భారతదేశంలో జరిగిన అతి పెద్ద, సుదీర్ఘ పోరాటమని అభివర్ణించారు. ప్రభుత్వ యంత్రాంగాల నుంచి ఒత్తిళ్లు వచ్చినా ఓర్పు, సహనం, నిబద్ధతతో వెనుకడుగు వేయని అమరావతి రైతుల ధైర్యానికి వందనం చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంచిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలన అనేది నిరంతర ప్రక్రియ అని, అధికారం మారినప్పుడు విధానాల్ని మార్చటం తప్పని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. అలా చేస్తే వృద్ధి ఆగిపోవటంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అధికార వ్యవస్థను ప్రతీకార రాజకీయాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు.

# పాక్‌కు అనుకూలంగా సిఎం వ్యాఖ్యలు

- కాంగ్రెస్‌ంది ముందునుంచీ ఇదే ధోరణి
- ఎక్స్ వేదికగా మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఆంధ్ర ప్రగతి నవంబర్ 01:** ద

పాకిస్థాన్ మీద కాంగ్రెస్ పార్టీ ప్రేమ, అభిమానం అజరామరమని.. గురువు నుంచి శిష్యుడి దాకా అదే వ్యామోహం అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్‌, ఆపరేషన్ సింధూర్‌ను చులకన చేస్తూ భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతూ భారత ఆర్మీని అగౌరవ పరుస్తున్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వైపుకు స్టాండ్ తీసుకొని శత్రుదేశం భాషలో మాట్లాడుతూ శత్రువుల మాటలను సిగ్గు లేకుండా వల్లెవేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగబద్ధ హోదాలో ఉండి కూడా నిజానిజాలు తెలియకుండా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి తెలియని విషయం ఏంటంటే.. పాకిస్థాన్ భూభాగంలో దాక్కున్న ఉగ్రవాదులను, వారి స్థావరాలను భారత గైడెడ్ క్షిపణులు విజయవంతంగా మట్టుబెట్టాయని.. 11 ఎయిర్ బేస్‌లను పూర్తిగా ధ్వంసం చేశాయన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవుపలికారు.

# రాయ్‌పూర్ సత్యసాయి సంజీవనీ ఆస్పత్రిని సందర్శించిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

శస్త్రచికిత్సలకు ప్రత్యేకమైన ఈ ఆస్పత్రిలో ఆపరేషన్లు పూర్తయి ఆరోగ్యంగా ఉన్న చిన్నారులతో పీఎం సమావేశమయ్యారు. తొలుత ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధానిని వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్ వ్యవస్థాపకులు సద్గురు మధుసూదన్ సాయి ఆహ్వానం పలికారు. అనంతరం సత్యసాయి ఆస్పత్రుల ఛైర్మన్ శ్రీనివాసన్ ప్రధానికి సత్యసాయి చిత్ర పటాన్ని అందజేశారు. ముందుగా ప్రధాని భగవాన్ సత్యసాయి బాబా విగ్రహానికి మోదీ పూజలు నిర్వహించారు. అనంతరం చికిత్స పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మోదీ ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్, సత్య సాయి సంజీవనీ హాస్పటల్స్ ట్రస్టుల్లో ఒకరైన సునీల్ గవాస్కర్ పాల్గొన్నారు.

# ఎన్డీయేవి విభజన రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

మళ్లించలేకపోవడంతోనే.. ఓట్ల చోరీకి పాల్పడుతోందని భాజపాపై మండిపడ్డారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని పేర్కొన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెగుసరాయ్‌లో తన తొలి ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. దేశాభివృద్ధికి బిహార్ ఎంతో దోహద పడిందని, రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడిపోయిందన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీలను భాజపా నేతలు విమర్శిస్తున్నారు. నిరుద్యోగం, వలసల వంటి అసలైన సమస్యలను పట్టించుకోవడం లేదు. విభజన రాజకీయాలు చేస్తున్నారు. అయినప్పటికీ.. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకపోయారు. అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. ఎన్డీయే వాగ్దానాలు చూసి మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కారు లేదని, ప్రతిదీ దిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఎన్డీయే పాలనలో ప్రైవేటీకరణ పెద్దఎత్తున జరుగుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ కొందరికి అప్పగించారని ఆరోపించారు. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో ఆమె మీడియా తో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భాజపా కోటి ఉద్యోగాల హామీపై స్పందిస్తూ.. ఇన్నేళ్ల పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు.

# సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు

**అమరావతి,నవంబర్ 01:** ఏపీలో ధాన్యం రైతులకు కూటమి సర్కార్ శుభవార్త తెలిపింది. సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మంత్రి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు ధాన్యం వివరాల నమోదుకు 7337359375 వాట్సాప్ నంబర్‌ని వినియోగించుకోవాలని సూచించారు మంత్రి నాదెండ్ల మనోహర్. రైతులు ఈ వాట్సాప్ నంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. 2025 నుంచి 2026 వరకు ఖరీఫ్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీవ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా 2,061 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 24 గంటల నుంచి 48 గంటల్లోపే... రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము జమయ్యేలా చర్యలు చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం మేరకు 10 మంది వరకు మరణించారని తెలుస్తోంది.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలి.. సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని మా పార్టీకి చెందిన నాయకులను ఆదేశించాను.. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారు.. అలాగే, సింహాచలంలో జరిగిన దుర్ఘటనలో మరో ఏడుగురు మరణించారు.. ఇప్పుడు కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట కారణంగా ఇప్పటి వరకూ 10 మంది మరణించారని మీడియా ద్వారా సమాచారం వస్తోంది అని జగన్ అన్నారు. ఇక, ఈ 18 నెలల కాలంలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నది అర్థం అవుతోంది అని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ భక్తుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు.. చంద్రబాబు అసమర్థ పాలనకు నిదర్శనం ఇది అని విమర్శించారు. ఇకనైనా కళ్లుతెరిచి తప్పులను సరిదిద్దుకోవాలని తెలిపారు.

# దేశ బలోపేతానికి యువతదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

మన మహనీయులు, ముఖ్యంగా నవభారత నిర్మాత సర్దార్ పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.యువత తమ వ్యక్తిత్వాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి, యోగి వేమన బోధనలు మార్గదర్శకాలని పేర్కొన్నారు. సరళమైన పదాలతో పద్యాల ద్వారా ఆయన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తి త్వం రూపుదిద్దుకుంటుందని దిశానిర్దేశర చేశారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాగా ఇవాళ ఆయన కడపకు చేరుకున్నారు. ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ జేసీ అదితి సింగ్, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ , ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులెట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మోద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో అమ్మవారికి లక్షపుష్పార్చన

**యాదగిరి గుట్ట,ఆంధ్ర ప్రగతినవంబర్ 01:** ప్రముఖ పుణ్య క్షేత్రంమైన యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవార్లకు ఉత్సవ మూర్తులకు వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అర్చన చేశారు. ప్రత్యేక మంగళహారతితో స్వామివారిని కొలిచారు. లక్ష పుష్పార్చన పూజలను ప్రతి మాసంలో శుద్ధ ఏకాదశి, బహుళ ఏకాదశి రోజున నిర్వహించడం ఆనవాయితీ వస్తుందని అర్చకులు తెలిపారు. ఈ పుష్పార్చన పూజలో స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా కార్తికమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం.!

## మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి. రివర్స్ స్ట్రాటజీ ద్వారా కుందూ నది నీటి మళ్లింపు. -తొలిసారి జిల్లా కలెక్టర్ జి రాజకుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు, 01:**
మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతుకు, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిలు అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మొంథా తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలు, నష్ట ప్రభావిత ప్రాంతాలపై జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్తా జయసూర్యలతో కలిసి సంయుక్తంగా అధికారులతో సమీక్షించి అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.






ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్. ఎం. డీ. ఫరూక్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా పంట నష్టం చోటుచేసుకుందని, నిష్పక్షపాతంగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాలను ఖచ్చితంగా లెక్కించి నివేదికలు సమర్పించాలని ఆదేశించామని పేర్కొన్నారు. రైతులందరికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. వాగులు, వంకలు మరియు కుందూ నది పొంగి ప్రవహించిన నేపథ్యంలో 'రివర్స్ స్ట్రాటజీ' ద్వారా నీటిని మళ్లించడం వల్ల నంద్యాల పట్టణాన్ని పెద్ద ప్రమాదం నుండి కాపాడగలిగామని తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా మున్సిపాలిటీకి కూడా గణనీయమైన నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నిత్యం పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగానికి సమయానుకూల ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించడంతో ప్రజలను సురక్షితంగా కాపాడగలిగామని అన్నారు. తుఫాన్ సమయంలో వాగుల్లో పొంగిపొర్లుతున్న నీరు రోడ్లపై ప్రవహించడంతో కొంత కాలం పాటు రాకపోకలను నిలిపివేయాల్సి వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన మొత్తం పరిస్థితిని ముఖ్యమంత్రికి సమగ్రంగా నివేదిస్తామని తెలిపారు. తుఫాన్ సమయంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మరియు అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారని మంత్రి ఫరూక్ ప్రశంసించారు. ప్రజల భద్రత, పంట రక్షణ, మౌలిక వసతుల పునరుద్ధరణ దిశగా అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందన్నారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే అంచనా వేసి అధికారులు అప్రమత్తం చేసినట్లు చెప్పారు. వరద నీరు రివర్స్ దిశగా మళ్లించే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్న నీటిపారుదల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగం వ్యవహరించిన తీరు ఒక కేస్ స్టడీగా నిలిచిందని, దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నేడు మనమంతా ప్రశాంతంగా కూర్చున్నామంటే కారణం క్షేత్రస్థాయిలో అధికారులు సమష్టిగా పనిచేసి తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడమేనని అన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా పంట నష్టం అంచనా వేయాలని, అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. కేవలం కార్యాలయాల్లో కూర్చుని అంచనాలు వేయొద్దని స్పష్టం చేశారు. 48 గంటల పాటు పంట నీట మునిగితేనే నష్టపరిహారం అందజేస్తామన్న అధికారుల నిర్ణయాన్ని మరోసారి పునఃసమీక్షించి, రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా రహదారుల మరమ్మత్తు పనులు తక్షణం చేపట్టాలని, ఆర్ %డ% బీ శాఖ అధికారులు నష్టం అంచనా వేస్తే అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఒక బాధ్యత గల ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గారి పనితీరు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అర్ధరాత్రి 2 గంటలకైనా సచివాలయంలో ఉండి ప్రతి జిల్లా యంత్రాంగాన్ని పర్యవేక్షించిన ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్, లోకేష్ సైతం తుఫాను ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించారని చెప్పారు. రాష్ట్రంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. సమయం పడుతుందేమో కానీ ప్రతి బాధితునికి న్యాయం చేస్తామని ధైర్యంగా చెప్పారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా బాధితులకు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. అధికారులు తొందరపాటుగా కాకుండా క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఇంత పెద్ద విపత్తు సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాల్సిన సందర్భంలో విమర్శలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండే నాయకుడు చంద్రబాబు నాయుడు అని తెలిపారు. గతంలో ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు నెల్లూరు జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు భరోసా ఇచ్చిన నాయకుడు నాయుడే అని గుర్తు చేశారు. నేడు ముఖ్యమంత్రి హోదాలో కూడా తన అనుభవంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయంతో ముందుండి నడిపించిన ఆయన ప్రతిభ వలనే రాష్ట్రం ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా బయటపడగలిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం మరియు అధికారులు సమన్వయంతో పని చేయడం వల్లే ఈ విపత్తును సాఫీగా ఎదుర్కొనగలిగామని చెప్పారు. గతంలో బనగానపల్లెలో కుందూ నది ప్రవాహం వల్ల తీవ్ర పంట నష్టం వాటిల్లేదని, అయితే ఇప్పుడు జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడంతో పంట నష్టం తీవ్రత తగ్గిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ.. మొంథా తుఫాను ప్రభావం ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాలకు మాత్రమే ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, నంద్యాల జిల్లాలో కూడా ఫ్లాష్ ఫ్లడ్స్ రూపంలో నవంబర్ 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎటువంటి విపత్తు సంభవించకుండా పూర్తి స్థాయిలో నిరోధక చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 30 మండలాలు ఉండగా, అందులో 27 మండలాలు వరద ప్రభావానికి గురై, సుమారు 244 గ్రామాలు వర్షాల వల్ల నష్టపోయినట్లు వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, భోజనం, వసతి వంటి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ముఖ్యంగా నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మండలాలు ఎక్కువ వర్షాలకు గురై, సుమారు 17,055 మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. జిల్లాలో పంట పొలాలకు సంబంధించి 65 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసినట్లు తెలిపారు. అందులో 36,948 హెక్టార్ల పంటలు నష్టపోయాయి ం వీటిలో 17 వేల హెక్టార్లు వరి, 17 వేల హెక్టార్లు మొక్కజొన్న, మిగతా 2 వేల హెక్టార్లు ఇతర పంటలు అని వివరించారు. పండ్ల తోటలకు సంబంధించి 744 హెక్టార్లు నష్టపోయాయని, ముఖ్యంగా మిరప, పపాయి, ఉల్లి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో సుమారు 27 వేల మట్టి మిద్దెలు ఉండగా, అధిక వర్షాల కారణంగా అక్కడ ఎవరూ ఉండకుండా రెవెన్యూ సిబ్బంది ద్వారా నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 7 వేల ఇళ్లు దెబ్బతిన్నాయని, అందులో 897 ఇళ్లు (నంద్యాల-554, ఆత్మకూరు-193, డోన్-150) తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. పూర్తిగా ధ్వంసమైన ఇళ్లకు రూ. 1.20 లక్షలు, పక్కా ఇళ్లకు రూ. 6 వేల, కచ్చా ఇళ్లకు రూ. 4 వేల చొప్పున పరిహారం ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యశాఖకు సంబంధించి 25 పడవలు, 34 చేప వలలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖకు చెందిన 27 రోడ్లు (సుమారు 110 కిమీ), పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 6 రోడ్లు (సుమారు 32.85 కిమీ) నష్టపోయాయని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 17 వరకు దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో అధిక వర్షాల కారణంగా వ్యవసాయం, హార్టికల్చర్ మినహా మొత్తం నష్టం రూ. 1686.01 లక్షలుగా అంచనా వేయబడిందని వివరించారు.

రివర్స్ స్ట్రాటజీ ద్వారా కుందూ నది నీటి మళ్లింపు %-% తొలిసారి - జిల్లా కలెక్టర్

జిల్లాలో అధిక వర్షాల కారణంగా వెలుగోడు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడంతో, నీటిని కుందూ నదికి విడుదల చేసినట్లు తెలిపారు. అయితే, కుందూ నదిలో నీరు పెరిగితే నంద్యాల పట్టణానికి వరద ముప్పు ఉండే అవకాశం ఉన్నందున, రివర్స్ స్ట్రాటజీ ద్వారా కుందూ నదిలోని నీటిని గాలేరు%-%నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు మళ్లించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్యలో జిల్లా మైనర్ మరియు మేజర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలి.

### ఎసిబి అధికారులమంటూ వచ్చే ఫేక్ ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 01:** ప్రభుత్వ అధికారులు తమ విధులను పారదర్శకంగా నిర్వహించి అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 2025 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, ఎసిబి అధికారులు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువంటి అవినీతి చోటు చేసుకోకుండా ఉండే దిశగా ప్రతి ఒక్క అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 122 శాఖల్లో అవినీతి నిరోధక శాఖ కూడా ఒక ముఖ్యమైన విభాగమన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలు పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఎవరైనా తప్పు దారిలో వెళ్తే వారిని సరైన మార్గంలో నడిపించడంలో ఎసిబి కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా ఒకరిద్దరు ఉద్యోగులు అవినీతికి పాల్పడితే, దాని చెడు ప్రభావం మొత్తం శాఖకు మోపడం వల్ల ప్రజల్లో ఆ శాఖపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్టర్ ప్రదర్శించి, ప్రజలకు అందించే ప్రతి సేవకు అవసరమైన సమయం, విధానం స్పష్టంగా చూపించాలన్నారు. అలాగే, ప్రతి ఉద్యోగి తమ వార్షిక రహస్య నివేదికలు మరియు ఆదాయ వివరాలను సమయానికి సమర్పించడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

అలాగే, "ఎసిబి అధికారులమంటూ ఫేక్ ఫోన్ కాల్స్ చేసి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ నగదు చెల్లించకూడదని, ఆన్లైన్ ద్వారా కూడా చెల్లింపులు చేయరాదు" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘాలతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భేటీ.



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లి అ నవంబర్ 01:**



బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు రిజర్వాయర్ పరిధిలోని మత్స్యకార సంఘాలు, కుటుంబాలతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చిన అవుకు, సంగ పట్టణం, మెట్టుపల్లి గ్రామాల మత్స్యకారులు. మత్స్యకార కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు చేపల వేటకు అవసరమైన వలలు, బోట్లు వంటి అత్యాధునిక పరికరాలు సబ్సిడీ ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తుందన్న మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు.

## ఆంధ్ర రాష్ట్ర అవతరణ చారిత్రాత్మక దినాన్ని విస్మరించడం విచారం.

### రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:**
కర్నూలు చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాన్ని నవంబర్ 1న నిర్వహించడం ఆవేదన కలిగించిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయం, నంద్యాలలో కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. "కర్నూలు ఉత్సవ్ %-% 2025 పేరుతో ఉమ్మడి కర్నూలు జిల్లా చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాన్ని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించడం మేము స్వాగతిస్తున్నాం. అయితే, ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామని ప్రకటించడం ఆశ్చర్యకరమూ, బాధాకరమూ" అని పేర్కొన్నారు. రాయలసీమ హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నేత టీజీ వెంకటేష్ గారు నవంబర్ 1న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం బాధాకరమని ఆయన అన్నారు. "తెలుగు రాష్ట్రం అక్టోబర్ 1, 1953న ఏర్పడింది. శ్రీబాగ్ ఒడంబడిక స్ఫూర్తితో రాయలసీమ నాయకత్వం కోస్తా నాయకత్వంతో భుజం భుజం కలిపి ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం పోరాడింది. ఆ ఉద్యమానికి కొనసాగింపుగానే శ్రీ పొట్టి శ్రీరాములు గారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం ద్వారా ఆంధ్ర రాష్ట్రం అక్టోబర్ 1న ఆవిర్భవించింది" అని బొజ్జా గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా నిలిచిందని, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు కర్నూలులోని కె.వి.ఆర్. కళాశాల సమావేశ మందిరంలో ప్రమాణస్వీకారం చేసిన చారిత్రక అంశాన్ని ఆయన గుర్తుచేశారు. తరువాత నవంబర్ 1, 1956న తెలంగాణ విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, తరువాత జూన్ 2, 2014న తెలంగాణ తిరిగి విడిపోయి ఏర్పడిందని వివరించారు. "చారిత్రాత్మకంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా తెలుగు రాష్ట్ర అవతరణ అక్టోబర్ 1ననే జరిగింది. ఈ నిజాన్ని విస్మరించి నవంబర్ 1న కార్యక్రమం నిర్వహించడం చరిత్రను వక్రీకరించే చర్య" అని బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ హక్కుల కోసం పోరాడిన నాయకులు, చారిత్రాత్మక, సాహిత్య రంగాలలో ప్రముఖులైన వ్యక్తులు నవంబర్ 1న టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనడం విచారకరమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఇది శ్రీబాగ్ ఒడంబడిక వంటి చారిత్రక పత్రాలను ప్రజల మనసుల నుండి తొలగించే ప్రయత్నంలో భాగంగా కనిపిస్తోంది" అని బొజ్జా తీవ్రంగా స్పందించారు. ఇప్పటికైనా చారిత్రక సత్యాన్ని గౌరవిస్తూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 1ననే నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.ఎన్.రెడ్డి, ఏర్వ రామచంద్రరెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, కోశాధికారి చెరుకూరి వెంకటేశ్వరనాయుడు, సభ్యులు కొమ్మా శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, రాముడు, అసదుల్లా మియా, మహబూబ్ బాష, గురజాల మద్దిలేటి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లవాగు పై నిర్మించిన వంతెన నిర్మాణంలో అవకాతవక లపై విచారణ జరిపించాలి

**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 01:**
బొల్లవరం వద్ద రాళ్లవాగుపై నిర్మించిన వంతెన నిర్మాణంలో జరిగిన అవకతవకలు. అవినీతిపైతగిన జరిగినవిచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న సిపిఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు. జనసేన పార్టీ నాయకుడు మురళి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గురుమూర్తి రాళ్ల వాగుపై నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ అధికారులకు డిమాండ్ చేశారు.

మహానంది మండలం బొల్లవరం వద్ద రాళ్లవాగుపై నిర్మించిన వంతెనలో ఇంజనీరు ఇచ్చిన ప్లానులోఅనేక అవకతవకలు ఉన్నాయని బ్రిడ్జి ప్లానులోవాగుపై కాకుండా వాగు పక్కన కట్టడం వల్ల వాగు నుండి వచ్చే వరద నీరు బ్రిడ్జి పైనుంచి పోవడం జరుగుతుందని మొన్న వచ్చిన అధిక వర్షాలతో వాగు దాటేందుకు తీవ్ర



ఇబ్బందులు గురయినారని ఆ బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు 60 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించగా కేవలం 20 లక్షల రూపాయలతోనే తూతూ మంత్రంలా పనులు మొదలుపెట్టి బ్రిడ్జి నిర్మాణం అయిపోయిందని వంతెన నిర్మాణానికి ముడి సరుకులు కంకర ఇసుక లాంటి వస్తువులను కూడా అక్కడే వదిలేసి కాంట్రాక్టరు చేతులు దులుపుకోవడం విచారకరమని విమర్శించారు.

జిల్లా ప్రభుత్వ యంత్రాంగం బొల్లవరం వద్ద రాళ్లవాగు పై నిర్మించిన వంతెన ను. ఇంజనీర్ ఇచ్చిన ప్లాను పరిశీలించి లక్షల రూపాయలు జరిగిన అవినీతిపై తగిన విచారించి అందుకు బాధ్యులు వారిపై చర్యలు చేపట్టకపోతే సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని పై నాయకులు హెచ్చరించారు.

# నెరవాటి హాస్పిటల్ లో అలర్జీ, వర్టిగో అత్యాధునిక క్లినిక్ ల ప్రారంభం.!

**ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ మధుసూదనరావు. -ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు.**

**ఏ అలర్జీతో ఇబ్బంది పడుతున్నారో నిర్దిష్టంగా తెలుసుకోవచ్చు: డాక్టర్ వినోద్. -వర్టిగో తో బాధపడే వారికి గొప్ప వరం: డాక్టర్ అరుణకుమారి.**



నెరవాటి అలర్జీ క్లినిక్ ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.



నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అలర్జీ, వర్టిగో క్లినిక్ ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ. చిత్రంలో ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నెరవాటి వినోద్, డాక్టర్ నెరవాటి అరుణకుమారి, డాక్టర్ మధుసూదనరావు, నంద్యాల వైద్యులు.



వర్టిగో క్లినిక్ ప్రారంభిస్తున్న నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు.

**ఆంధ్రప్రగతి నంద్యాల నవంబర్ 01:**
పద్మావతి నగర్ లో ఉన్న నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం ఆసుపత్రి నిర్వాహకులు చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన అలర్జీ, వర్టిగో అత్యాధునిక క్లినిక్ లను ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు ప్రారంభించారు.
ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల అలర్జీలతో చర్మ, శ్వాసకోశ ఇబ్బందులు పడే వారికి ఏ అలర్జీతో బాధపడుతున్నారో నిర్దిష్టంగా తెలుసుకొని సంబంధిత వైద్యం చేయడానికి తమ అలర్జీ క్లినిక్ లో అత్యాధునిక పరికరాలు, సాంకేతిక నిపుణులు ఏర్పాటు చేశామన్నారు.
అదేవిధంగా వర్టిగో అంటే తరచు కళ్ళు తిరగడం, కింద పడిపోవడం వంటి ఇబ్బందులు ఉన్నవారికి వర్టిగో క్లినిక్ లో సంబంధిత కారణాలు తెలుసుకొని దానికి అనుగుణమైన వైద్యం చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. వర్టిగో క్లినిక్ ను జాతీయస్థాయిలో సేవలు అందిస్తున్న న్యూరో ఈక్విలిబ్రియం సంస్థతో, అలర్జీ క్లినిక్ ను ఏవెక్సియా సంస్థతో కలిసి ఏర్పాటు చేసామన్నారు.
వర్టిగో క్లినిక్ లో వర్టిగో స్పెషలిస్ట్ డాక్టర్ అంజు పిల్లై, సాంకేతిక నిపుణులు తపస్వి , అలర్జీ క్లినిక్ లో ప్రబీర్ పట్నాయక్, భాష లు సేవలందిస్తారని తెలిపారు.
డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ అలర్జీతో బాధపడే వారి సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ క్లినిక్ లు నంద్యాల ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.
ఈ కార్యక్రమంలో నెరవాటి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ గగన్, పారిశ్రామికవేత్త నెరవాటి సత్యనారాయణ,ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూధన రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డ డాక్టర్ శ్రీనివాసరావు డాక్టర్ మహమ్మద్ రఫీ, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ నెట్ల మహేశ్వరరెడ్డి,మహిళా వైద్యులు డాక్టర్ నర్మద, డాక్టర్ మాధవి, డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, డాక్టర్ రాధిక జ్యోతి, డాక్టర్ ఆరీఫా బాను, డాక్టర్ తనూజ అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

## ముద్దం వన్షిక ను ఆశీర్వదించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోషల్ మీడియా పిఆర్వో ముద్దం నాగ నవీన్ కూతురు చిరంజీవి ముద్దం వన్షిక రెండవ పుట్టినరోజు వేడుక సందర్భంగా మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయం నందు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ చిన్నారి వన్షికను మనసారా ఆశీర్వదించారు. చిన్నారి వన్షిక నిండు నూరేళ్లు జీవించాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్బంగా ?ముద్దం నాగ నవీన్ మంత్రి ఫరూక్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనతో పాటు కార్యక్రమంలో పసుపులేటి మీనాక్షి ఉన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ రఫీ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల,నవంబర్ 01:**
నంద్యాల జిల్లా నూతన ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ మహమ్మద్ రఫీ ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని నంద్యాల టీడీపీ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ మహమ్మద్ రఫీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో జిల్లాలో వైద్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై క్లుప్తంగా చర్చించారు . అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఐఎంఏ కి ప్రభుత్వం తరపున, నా తరపున సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం.

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 01:**
ఆధునిక సాంకేతిక, నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ప్రముఖ రేడియాలజిస్ట్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రేడియాలాజిస్ట్, ఇమేజింగ్ అసోసియేషన్ 11వ రాష్ట్ర కాన్ఫరెన్స్- 2025 లో ముఖ్య అతిథిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్న రేడియాలజీ నిపుణులు ఒకే వేదికపై కలిసి ఆరోగ్యరంగ అభివృద్ధి కోసం చర్చించడం నిజంగా ప్రేరణనిచ్చే విషయం అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు ఆరోగ్య సేవలలో కొత్త సాంకేతికతలు, నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యరంగంలో అనేక సంస్కరణలు తెచ్చారని, ఐ ఆర్ ఐ ఏ లక్ష్యం కూడా అదేనని ఆమె అభినందించారు.

## నంద్యాలలో నూతన రేషన్ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎన్ ఎండి. ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:**నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ ప్రాంతంలో అద్దంకి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ పంపిణీ కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ శనివారం ఉదయం తన చేతుల మీదుగా ప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ పంపిణీ ఎప్పుడు జరుగుతుందో తెలియక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుచేస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెల 15 రోజులపాటు నిరంతర రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అదే విధంగా 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ అందజేయడం ద్వార ప్రభుత్వం మానవతా దృష్టితో ముందుకు సాగుతోందని వివరించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టిడిపి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండగా, వైసీపీ నాయకులు మాత్రం అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎన్ ఎండి ఫిరోజ్ విమర్శించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్బారాయుడు, సి .హరి, రవి బద్రీశెట్టి,నాగారత్నమ్మ, భారతి దేవి,రామకృష్ణ, జయకృష్ణ, స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీ నగర్ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.!

**-గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతాం-ఎన్ ఎండి ఫిరోజ్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 01:**
నంద్యాల నియోజకవర్గంలోని బాపూజీ నగర్ గ్రామంలో నిర్వహించిన గ్రామస్థుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ హాజరయ్యారు.ఈ సందర్బంగా గ్రామ ప్రజలు తమ గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు,వెంటనే ఎన్ఎండి ఫిరోజ్ స్పందిస్తూ గ్రామంలో వీధి దీపాల లేమితో అంధకారంలో ఉన్న వీధుల సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే అక్కడికక్కడే పరిష్కరించారు.అదే విధంగా గ్రామస్థుల కోరిక మేరకు స్మశానం కొరకు స్థల కేటాయింపును త్వరలోనే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై కూడా ఆయన స్పందిస్తూ త్వరలోనే మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.బాపూజీ నగర్ గ్రామ అభివృద్ధి కోసం మా కుటుంబం కట్టుబడి ఉందని తప్పక గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ఎన్ ఎండి ఫిరోజ్ భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు రామ సుబ్బయ్య, అడ్వకేట్ రామచంద్ర రావు,రాఘవేంద్ర రెడ్డి,రాముడు, మారుతీ, మాజీ కౌన్సిలర్ కృపాకర్, కామిని మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కుందు బ్రిడ్జి పై జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించిన ఎన్ ఎండి. ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:**
మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న , కుందు బ్రిడ్జి పై జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ శనివారం నాడు స్వయంగా వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి. ఫిరోజ్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ఉధృతి వల్ల కుందు బ్రిడ్జి పైనుంచి భారీగా నీరు ప్రవహించడంతో రోడ్డు తీవ్రంగా దెబ్బతిందని,దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని మంత్రి ఫరూక్ గారి ఆదేశాల మేరకు బ్రిడ్జి పై రోడ్డు మరమ్మత్తు పనులను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు.నంద్యాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు దెబ్బతిన్న ఈ రోడ్డును శరవేగంగా మరియు నాణ్యతతో మరమ్మత్తులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను తక్షణమే పరిష్కరించడం ద్వారా నందమూరి నగర్ , వైయస్సార్ నగర్ మరియు ఇతర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం సులభతరం అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ జూనియర్ కళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలి.!

## ఉర్దూ మీడియం చదువును గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం.

### ప్రస్తుతం 95% పనులు పూర్తి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:** నంద్యాలలో ఎక్కువ శాతం మైనార్టీ కుటుంబాలు నివసిస్తున్నాయి. ఉర్దూ మీడియం లో విద్యను అభ్యసించే విద్యార్థులు ఉన్నత చదువులు కోసం పడుతున్న ఇబ్బందులను గత వైసీపీ ప్రభుత్వంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా చొరవతో ఉర్దూ జూనియర్ కళాశాలను తీసుకురావడం జరిగింది. దాదాపుగా ఈ రోజు వారుకు 95% పనులు పూర్తి అయ్యాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉర్దూ జూనియర్ కళాశాల పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైంది. మైనార్టీ విద్యార్థులకు అండగా నిలబడి పెండింగ్ లో ఉన్న కళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా కోరారు.

# ఘాట్ రోడ్లో రోడ్డు ప్రమాదం

## ఒకరి మృతి.- కొందరికి గాయాలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 01:** నంద్యాల గిద్దలూరు ప్రధాన రహదారిలోని ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరికొందరు గాయపడినట్లు తెలుస్తుంది. మృతుడు మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన షేక్ మజీద్ (46) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. గిద్దలూరు సమీపంలోని కృష్ణం శెట్టిపల్లె, వెంకటాపురం తదితర గ్రామాల్లోని పంట పొలాల్లోని అరటి గెలలు పొలాల నుండి బయటకి తీసుకురావడానికి కూలీలు మహానంది మండలం నుంచి వెళ్లినట్లు తెలుస్తుంది. పనులు పూర్తి అవ్వగానే గిద్దలూరు వైపు నుండి నంద్యాల వైపు వస్తున్న ఖాళీ ఒక బొలెరో వాహనంలో దాదాపు 16 మంది, గిద్దలూరు, కృష్ణం చిట్టి పల్లె సమీపంలో వాహనంలో ఎక్కారని నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్ రోడ్లో దాదా కలందర్ దర్గా సమీపంలో ఉన్న కల్వర్టును బొలెరో వాహనం ఢీకొనడంతో షేక్ మజీద్ అక్కడికక్కడే మృతి చెందగా మరికొందరు గాయపడినట్లు తెలుస్తుంది. గాయపడిన వ్యక్తులను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం.

# వెల్దుర్తి మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.



**ఆంధ్ర ప్రగతి వెల్దుర్తి నవంబర్ 01:** వెల్దుర్తి జూనియర్ కళాశాల ఆవరణలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మండల సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర పోస్టర్లను జిల్లా అధ్యక్షుడు డి. సోమన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెల్దుర్తి మండలం కర్నూలు నగరానికి దూరంగా ఉండడం వల్ల విద్యార్థులు డిగ్రీ చదువుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రెండు మండలాల (వెల్దుర్తి, కృష్ణగిరి) విద్యార్థుల ప్రయోజనం కోసం వెల్దుర్తి పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బస్సు యాత్ర నవంబర్ 10న కర్నూల్ చేరుకోనుందని, ఆ రోజు జరిగే విద్యార్థి సభను వెల్దుర్తి విద్యార్థులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలంటూ, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్, అభిరామ్, గోపి, వంశీ, కృష్ణ, చరణ్, హేమంత్, నందు, రిషి తదితరులు పాల్గొన్నారు.

# కోవెలకుంట్ల మండలాన్ని నంద్యాల రెవిన్యూ డివిజన్లో కలపాలి.

## - మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కి వినతి.



**ఆంధ్ర ప్రతి బనగానపల్లె నవంబర్ 01:** కోవెలకుంట్ల మండలాన్ని డోన్ రెవెన్యూ డివిజన్ లో కలపడం వలన మండల ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని సరైన రవాణా సౌకర్యం లేకపోవడం రానుపోను దాదాపు 150 కిలోమీటర్లు ఉండడంవల్ల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోయిలకుంట్ల మండలాన్ని నంద్యాల రెవెన్యూ డివిజన్లో కలపాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం సుధాకర్, కరీం భాషా, వడ్డే సుబ్బరాయుడు, లింగన్న, అప్ప పోగుల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం.

## సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.



**ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 01:** డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారుఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# పట్టుదలతో శ్రమిస్తే విజయం మీ సొంతం :బిసి రాజారెడ్డి.!

## డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే. ముఖ్యఅతిథిగా హాజరైన బిసి రాజారెడ్డి.

### కాలేజీ జీవితం ఎంతో విలువైనది. - బిసి రాజారెడ్డి





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె నవంబర్ 01:** ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని పట్టుదలతో శ్రమిస్తే విజయం మీ సొంతం అవుతుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి బిసి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాలకు చేరుకున్న బిసి రాజారెడ్డికి ప్రిన్సిపల్ లలిత ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బిసి రాజారెడ్డి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి బిసి రాజారెడ్డి మాట్లాడుతూ.. కాలేజీ జీవితం ఎంతో విలువైనది అన్నారు. ఈ సమయంలో తప్పటడుగులు వేయకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. 10 నుంచి 25 ఏళ్ల వయస్సు లోపు మనం తీసుకునే సరైన నిర్ణయాలే మన వందేళ్ళ భవిష్యత్తుకు పునాది లాంటివన్నారు. ప్రతిఒక్కరికి స్నేహితుల అవసరమని అయితే చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు అష్ట కష్టాలు పడి పిల్లలను చదివిస్తుంటారని వారి ఆశలను, నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. చదువు ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని, చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కడప జిల్లా నందలూరు లో కనీసం వీధి దీపాలు, కరెంటు లేని సమయంలో లాంతరు వెలుగుల్లో చదువుకొని ఐదుగురు ఐఏఎస్ సాధించారన్నారు. అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రముఖ సైంటిస్ట్ గా దేశానికి ఎంతో విలువైన సేవలు అందించి రాష్ట్రపతిగా ఎదిగాడన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని విద్యను అభ్యసించాలని సూచించారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. దినపత్రికలు, పుస్తక పఠనం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. జ్ఞానంతో పాటు లోకజ్ఞానం కూడా ఎంతో ముఖ్యమన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం లభిస్తే సమాజం ద్వారా లోకజ్ఞానం నేర్చుకోవాలన్నారు. బనగానపల్లె డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ లలిత ఆధ్వర్యంలో బిసి రాజారెడ్డికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రజిక, అధ్యాపక బృందం, భానుముక్కల సహకార సంఘం చైర్మన్ అబ్దుల్ కలాం పాల్గొన్నారు.







# ఆంధ్ర అవతరణ దినోత్సవం -అమరజీవి పొట్టి శ్రీరాములు కు ఘననివాళి.

## నివాళులర్పించిన లయన్స్ క్లబ్, కళారాధన, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం: డాక్టర్ రవి కృష్ణ.



**ఆంధ్రప్రగతి నంద్యాల నవంబర్ 01:** శనివారం ఆంధ్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని కళారాధన కార్యాలయంలో నంద్యాల లయన్స్ క్లబ్, కళారాధన, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళారాధన ప్రధాన కార్యదర్శి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ 1956లో పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసి అమరులైన తరువాత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. తెలుగువారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని, దేశంలో ప్రత్యేక గుర్తింపు ఉండాలని పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయం, భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. అమరావతిలో కూటమి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ. వి. రమణయ్య, కళారాధన కార్యవర్గ సభ్యుడు శివరామిరెడ్డి,నాగలింగేశ్వర రెడ్డి,లయన్స్ క్లబ్ సభ్యులు వాసు, కార్యాలయ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యం.

## ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ పోలీసు సిబ్బంది వారి కుటుంబాలకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు.

## కాకి దుస్తుల్లో మానవత్వం... రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారిన జిల్లా పోలీసులు.

## ఉచిత మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరం ప్రారంభించిన ఏ ఎస్ పి ఎం.జావళి ఆల్ఫోన్స్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:** నంద్యాల జిల్లా పోలీస్ వారి కుటుంబాల సంక్షేమం కొరకు ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల పట్టణంలోని ఆర్కె ఫంక్షన్ హాల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాక అక్టోబర్ 21వ తేదీ నుండి 31 వ తారీకు వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ నంద్యాల రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి, జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

అనంతరం ఏఎస్పి.జావళి, జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు, ఏ ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి,ఇన్స్పెక్టర్లు జీవన గంగనాథ్ బాబు, ఈశ్వరయ్య , కృష్ణయ్య స్వయంగా రక్తదానం చేసి శిబిరానికి వచ్చిన వారికి ఆదర్శంగా నిలవడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా 32 మంది పోలీసు అధికారులు వారి సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు నంద్యాల ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ,గవర్నమెంట్ కాలేజ్ ,రామకృష్ణ కాలేజ్ , ఆర్జీఎం కాలేజ్ ల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని స్వచ్ఛందంగా 148 మంది రక్తదానం చేయడం జరిగింది.

నంద్యాల శాంతిరాం హాస్పిటల్ వారి సౌజన్యంతో సుమారు 147 నంద్యాల పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు ఆర్తో ,జనరల్ మెడిసిన్ ,గైనకాలజిస్ట్, గుండెకు సంబంధించి నిష్ణాతులైన డాక్టర్ల సమక్షంలో బిపి, షుగర్, 2 డి ఈ సిహెచ్ఓ, ఈసీజీ మొదలగు పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు ఏదైనా ఆరోగ్య సమస్యఉంటే తగిన సూచనలు చేయడంతో పాటు ప్రాథమిక దశలోనే సరైన చికిత్స చేసుకోవాలని పలు సూచనలు చేయడం జరిగింది.




ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద జావళి, జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు తో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి , ఏ ఆర్ డిఎస్పి శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు కంబగిరి రాముడు, ఈశ్వరయ్య, జీవన్ గంగనాథ్ బాబు, కృష్ణయ్య రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ సురేష్ బాబు, రెడ్ క్రాస్ సొసైటీ వారి నుండి దస్తగిరి బాబు, కవిత వారి సిబ్బంది, పోలీసు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం.!

**-నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:** నంద్యాల పట్టణంలోని రైతు నగరం మరియు కానాల గ్రామాల మధ్య ఎన్నో ఏళ్లుగా అపరిష్కరుతంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్వయంగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి. ఫిరోజ్ చేరుకొని పరిశీలించి సమస్య యొక్క



తీవ్రతను అధికారులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎన్ ఎండి. ఫిరోజ్ మాట్లాడుతూ రైతునగర్ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడకుండా ఈ డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రి ఎన్ ఎండి. ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు చేపడతామని సమగ్ర నంద్యాల అభివృద్ధి తమ ధ్యేయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, పట్టణ టిడిపి నాయకులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఎరుకలి సర్టిఫికేట్ తో టీచర్ ఉద్యోగం చేస్తున్న

# గోవిందరాజులు పై చర్యలు ఎప్పుడు..?

**బహుజన టీచర్స్ ఫెడరేషన్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 01:** నంద్యాల జిల్లా నందికోట్కూరు గ్రామ నివాసి, మేదరి బి.సి కమ్యూనిటికి చెందిన తుమ్మల శేషయ్య కుమారుడు తుమ్మల గోవిందరాజులు నందికోట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదివిన తరువాత నందికోట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన తరువాత, స్కూల్ అడ్మిషన్ రిజిస్టర్లో అడ్మిషన్ నం : 7761ను మరియు జూనియర్ కాలేజి అడ్మిషన్ రిజిస్టర్లో అడ్మిషన్ నం : 5205ను స్కూల్ హెచ్.ఎం మరియు కాలేజి ప్రిన్సిపాల్ తో కలిసి రెండు చోట్ల అడ్మిషన్ రిజిస్టర్లు టాంపరింగ్ చేయించుకొని తన మేదరి బి.సి కమ్యూనిటిని ఎస్.టి ఎరుకలిగా మార్పిడి చేయించుకొని తిమ్మసారి గోవిందరాజులుగా చలామణి అవుతూ, నందికోట్కూరు ఎం.ఆర్.ఓ కార్యాలయ స్టాంపు కలిగిన ఎస్.టి ఎరుకలి సర్టిఫికేట్ సంపాందించి, అడ్డదారిలో ఎస్టి కోటాలో 2000 డి.ఎస్.సి ద్వారా సెకండ్ గ్రేడ్ టీచర్ గా ఉద్యోగం పోదారని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ మేదరి బి.సి కమ్యూనిటికి చెందిన తుమ్మల గోవిందరాజులు తన కులం ఇంటి పేరు మార్చుకొని ఎస్టి కోటాలో అడ్డదారిలో ఉద్యోగం పొందారని సమాచారం సేకరించి కర్నూలు కలెక్టర్, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖాధికారులకు ఆధారాలతో పిర్యాదు చేయగా, వారు అప్పటి కర్నూలు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, అప్పటి పగిదాల యం.ఈ.ఓ సుభాన్




లతో విచారణ చేయించారని తెలిపారు. విచారణ చేపట్టిన అధికారులు నందికోట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నందికోట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డులు పరిశీలించి అక్కడ ఉన్న అడ్మిషన్ రిజిస్టర్లు టాంపరింగ్ అయినట్లు గుర్తించి తమ నివేదికను 18.02.2021న కర్నూలు కలెక్టర్ కు సమర్పించారని తెలిపారు. అప్పటి కలెక్టర్ కోటేశ్వరరావు నివేదిక ఆధారంగా నందికోట్కూరు స్కూల్ మరియు కళాశాల రికార్డులు, ఎం.ఆర్.ఓ ఆఫీసులో కుల ధృవీకరణ పత్రం చూసి చర్యలు తీసుకోవాలని 18.01.2022న ఆదేశాలు జారీచేసి నేటికి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అక్రమంగా జీతాలు చెల్లిస్తూ ప్రజాధనం వృధా చేయడం ఎంతవరకు సబబు అని బిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సతీష్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇప్పటికి గడచిన ఐదేళ్లలో నలుగురు కలెక్టర్లు నలుగురు డిఈఓ లు మారినా కూడా గోవిందరాజులుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత శోచనీయం అన్నారు. తక్షణమే తిమ్మసారి గోవిందరాజులుపై చర్యలు తీసుకోవాలని, అర్హులకు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలని అధికారులకు బహుజన టీచర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది.

## దానాధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారెమ్మ టెంపుల్ కు

# ధూప దీప జ్యోతి ప్రజ్వలన సామాగ్రి పంపిణీ.

**-దానధర్మాచారిటేబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఏ. నాగమల్లేశ్వరరెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల నవంబర్ 01:** సిరివెళ్ల మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామంలో మరియు బోయలకుంట్ల, సిరివెళ్ల, కోటపాడు, గోవిందపల్లి, ఎర్రగుంట్ల, గుంపర్ మాదిన్నె, వెంకటేశ్వరపురం, వీరారెడ్డిపల్లి, బోయలకుంట్ల గ్రామాలలో గల మారెమ్మ తల్లి దేవాలయాలకు మరియు వివిధ దేవాలయాలకు ధూప దీపా నైవేద్య జ్యోతి ప్రజ్వలన సామాగ్రిని దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఏ. నాగమల్లేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. కామినేనిపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ శిరిగిరి రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా కామినేని పల్లె మారెమ్మ టెంపుల్ కు జ్యోతి ప్రజ్వలన సామాగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ



సందర్భంగా శిరిగిరి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాత్మికంగా కార్తీక మాసం ఎంతో విశిష్టమైనదని ఈ మాసంలో అన్ని రోజులు ప్రత్యేకమైనవేనని ఈ మాసంలో శివుడిని అమ్మవారిని సకల దేవతలను పూజించి దానధర్మలు చేసేవారికి పాపాలనుంచి విముక్తి లభించడమే కాకుండా మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో మారెమ్మ తల్లిని కొలిస్తే సౌభాగ్యం కలకాలం నిలుస్తుందని బ్రహ్మీముహూర్తంలో స్నానమాచరించి పరిశుభ్రమైన బట్టలు ధరించి మొదటగా దీపారాధన చేసి నియమాలు పాటించి జ్యోతి ప్రజ్వలన గావిస్తే. నిత్య సిరి సంపదలతో, సుఖ సౌఖ్యాలతో వర్ధిల్లుతారని అన్నారు. శక్తి స్వరూపిణి అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ పొలిమేర మారెమ్మ తల్లి యొక్క కరుణ ఉంటే ఎలాంటి గ్రహ దోషమైనా తొలగిపోతుందని ఏ. నాగమల్లేశ్వర రెడ్డి పేర్కొన్నారు. అప్పుల బాధలు, ఆర్థికపరమైన సమస్యలు తొలగిపోతాయని శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. వేకువ జామున పూజించడం వలన ఎక్కువ ఫలితాలు కలుగుతాయి.కార్తికమాసంలో స్నానం, దానం, దీపారాధనం, అర్చనం, దైవ దర్శనం అనే పంచకృత్యాలను ఆచరించడం వల్ల సర్వ శుభాలు సకల సంపదలు నిత్యం దైవానుగ్రహం లభిస్తుందని శిరిగిరి రాంభూపాల్ రెడ్డి తెలియజేశారు.

# కార్తీక ఏకాదశితో ఆలయాల్లో రద్దీ



యాదగిరిగుట్ట,**ఆంధ్ర ప్రగతి** కార్తిక మాసం శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మహా విష్ణువు ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణ్యా మారుమోగాయి. యాదగిరిగుట్టతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. దీనిని చిలుకు ఏకాదశి కూడా అంటారు. దీంతో హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని అన్న వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. యాదాద్రితో పాటు రత్నగిరి, నగరంలోని టిటిడి వెంకటేశ్వరాలయాలు, పాతబస్ఈ రంగనాథ ఆలయంలో రద్దీ కనిపించింది. శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, చిన్నదూగం కూడలిలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహా స్వామిని దర్శించుకునేందుకు కోటబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస మండల ప్రాంతాల్లోనూ విష్ణు, శివ ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సుమారు కిలోమీటర్ పొడవునా బారులు తీరారు. కార్తిక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.

# తుఫాన్ బాధితులను గాలికి వదిలేస్తే ఎలా?

చెరువులు, నాలుల కబ్జాకు గురవుతున్నాయని స్వయంగా ప్రకటిస్తున్న పాలకులు అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాకోరులను ప్రభుత్వాలే రక్షిస్తూ గడుసు మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాలు తలచుకుంటే కబ్జారాయుళ్లను తొలగించడం నిముషంలో పని. హైడ్రా చేస్తున్న పనిని అంతటా చేయించే బాధ్యత ఉందా లేదా అన్నది సిఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి. వరంగల్ జిల్లాలో వరదనష్టం సందర్భంగా కబ్జాలపై వ్యాఖ్యలు చేసిన సిఎం, అందుకు తగ్గట్లుగా ప్రణ్ళాళిక సిద్దం చేసి చిత్తశుద్దిని చాటాలి. ఉత్పాతాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా సాయం ప్రకటించడం, అందరినీ ఆదుకున్నామని చెప్పడంతో సరిపెట్టేస్తున్నారు. ఇల్లు మునిగిని వారికి 15 వేలు పరిహారంగా తెలంగాణ సిఎం ప్రకటించారు. ఈ డబ్బుతో ఏం వస్తుందో అధికారులు, సిఎం రేవంత్ రెడ్డి చెబితే బాగుండేది. దెబ్బతిన్న ఇళ్లను, రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించడం లేదు. ఆక్రమణలను తొలగించాలన్న దానికి కూడా ప్రణాళిక లేదు. అలాగే ఎపిలో తుపాన్‌లో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు సర్టిఫికెట్లు ఇచ్చారు. అధికారులు పనిచేయడం వారి విధి. జీతాలు తీసుకుంటున్నారు. అయినా వెన్నుతట్టి ప్రోత్సహిం చాల్సిందే. ఇదే సమయంలో గ్రామాల వారీగా నష్టపోయిన వారి లెక్కలు తీసుకుని ఆదుకుంటే బాగుం టుంది. ఎందుకంటే తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు సామాన్యుల జీవితాలు చిగురుటాకులా వణికిపోతు న్నాయి. వీరిని



ఆదుకోవాలి. ఆదుకునే వరకు మనమంతా సంఘటితంగా ముందుకు సాగాలి. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత ముఖ్యం. తుఫాన్ గండం గడిచింది కనుక గ్రామాల వారీగా తెలుగు రాష్ట్రాల్లో బాధితులను గుర్తించి వారిని ఆదుకోవాలి. పంటలను ఎంతమేరకు నష్టపోయారో లెక్కలు వేయాలి. ఎకరా పంటకు ఎంతపెట్టుబడి పెట్టారో గుర్తించాలి. అన్నదాతల విషయంలో అలసత్వం తగదు. తాజా మొంథా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేసి ఆదుకోవడంలో కేంద్రం ఉదారంగా ముందుకు రావాలి. పంటనష్టపోయిన రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాలి. గతంలో పెనుతుపానులు, వరదలు వచ్చినప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన

బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ముందుగానే అంచనా వేసినట్లుగానే మొంథా అల్లకల్లోలం సృష్టించింది. ప్రత్యేకించి కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్టు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశర చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. అయితే ఇదే చొరవతో ఇప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవాలి. సామాన్యుల నుంచి రైతుల వరకు అనేకులు తీవ్రంగా నష్టపోయారు. వారిని గుర్తించి ఆదుకోవడం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

# ఆసుపత్రి నుంచి శ్రేయాస్ అయ్యర్ డిశ్చార్జ్



టీమిండియా స్టార్ క్రికెటర్ శ్రేయాస్ అయ్యర్ ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్ సమయంలో గాయపడిన విషయం తెలిసిందే. హర్షిత్ రాణా బౌలింగ్‌లో ఆసీస్ ఆటగాడు అలెక్స్ క్యారీ ఇచ్చిన క్యాచ్ పట్టే ప్రయత్నంలో.. శ్రేయాస్ పక్కటెముకలకు బలమైన గాయమైంది. దీంతో వైద్య సిబ్బంది సహాయంతో శ్రేయాస్ గ్రౌండ్ వీడాడు. గాయం తీవ్రం కావడంతో అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ట్రీట్మెంట్ అందించారు. తాజాగా శ్రేయాస్ అయ్యర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యం కుదుటపడిందని.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని తెలిపింది. ఈ సందర్భంగా సిడ్నీ డాక్టర్ కొరొష్ హగిగి, అతడి వైద్య బృందానికి, అదేవిధంగా భారత్‌కు చెందిన డాక్టర్ దిన్షా పార్దీవాలాకు బీసీసీఐ ధన్యవాదాలు చెప్పింది. శ్రేయాస్ త్వరగా కోలుకునేలా మెరుగైన చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు తెలిపింది. అయితే శ్రేయాస్ అయ్యర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినప్పటికీ కొన్నాళ్లు సిడ్నీలోనే ఉండనున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. విమాన ప్రయాణం చేయొచ్చునని వైద్యులు చెప్పిన తరువాతే.. శ్రేయాస్ ఇండియాకి తిరిగి రానున్నాడు. ఇక తన హెల్త్‌పై సోషల్ మీడియా వేదికగా శ్రేయాస్ అయ్యర్ రెండ్రోజుల క్రితం స్పందించాడు. ప్రస్తుతం కోలుకుంటున్నాను. రోజురోజుకు మరింత మెరుగ్గా అనిపిస్తుంది. క్లిష్ట

# ప్రో కబడ్డీ లీగ్-12వ సీజన్ విజేత ఢిల్లీ

- ఉత్కంఠ పోరులో పుణేరి పల్టాన్‌పై విజయం!
- 12 సీజన్లలో రెండోసారి ఛాంపియన్‌గా దబాంగ్ ఢిల్లీ



ప్రో కబడ్డీ లీగ్-12వ సీజన్‌లో దబాంగ్ ఢిల్లీ కేసీ విజేతగా అవతరించింది. ఢిల్లీలోని త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో 31-28 తేడాతో టేబుల్ టాపర్ పుణెరి పల్టన్‌ను ఓడించింది. ఫలితంగా ఆషు మాలిక్ కెప్టెన్సీలోని ఢిల్లీ రెండోసారి పీకేఎల్ టైటిల్ అందుకుంది. గతంలో 8వ సీజన్‌లో ఢిల్లీ ట్రోఫీ నెగ్గిన విషయం తెలిసిందే. ప్రస్తుత హెడ్ కోచ్ జోగిందర్ నర్వాల్ అప్పుడు ఆ జట్టుకు కెప్టెన్‌గా ఉండటం విశేషం. తద్వారా పీకేఎల్‌లో కెప్టెన్‌గా, హెడ్‌కోచ్‌గా టైటిల్ గెలిచిన రెండో వ్యక్తిగా జోగిందర్ నిలిచాడు. ఈ విజయంతో దబాంగ్ ఢిల్లీ ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సీజన్ 2లో యు ముంబా తర్వాత, సొంతగడ్డపై ఆడుతూ ట్రోఫీ గెలిచిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఇదే మ్యాచ్‌లో ఢిల్లీ డిఫెండర్ ఫజల్ అత్రాచలి పీకేఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన విదేశీ ఆటగాడిగా నిలిచాడు. ఇక పుణెరి పల్టన్‌తో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ రైడర్ నీరజ్ నర్వాల్ 8 పాయింట్లతో సత్తా చాటగా.. అజింక్య పవార్ 6 పాయింట్లతో రాణించాడు. మరోవైపు, పుణెరి పల్టన్ తరపున ఆదిత్య షిండే సూపర్ టెన్ సాధించినా.. అభినేష్ నాడరాజన్ 4 ట్యాకిల్ పాయింట్లతో మెప్పించినా ఫలితం లేకుండా పోయింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన దబాంగ్ ఢిల్లీ ఫస్టాఫ్‌లో పుణేరి పల్టాన్ ఒకసారి ఆలౌట్ చేసి 20-14తో ఆధిక్యంలో నిలిచింది. తొలి అర్ధ భాగంలో రైడింగ్‌లో 13 పాయింట్స్ సాధించిన దబాంగ్ ఢిల్లీ.. 3 ట్యాకిల్ పాయింట్స్ అందుకుంది. సెకండాఫ్‌లో మాత్రం దబాంగ్ ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. రైడర్స్ విఫలమవ్వడంతో ప్రత్యర్థి చేతిలో ఒకసారి ఆలౌట్ అయ్యింది. దాంతో స్కోర్లు సమమై మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ ఫజల్ అత్రాచలీ కీలక ట్యాకిల్ పాయింట్‌తో ఆధిక్యం అందించి విజయాన్ని ఖాయం చేశాడు. సెకండాఫ్‌లో దబాంగ్ 4 రైడింగ్ పాయింట్స్‌తో పాటు 5 ట్యాకిల్ పాయింట్స్ సాధించగా.. పుణేరి పల్టాన్ 8 రైడింగ్ పాయింట్స్‌తో పాటు 3 ట్యాకిల్ పాయింట్స్ అందుకుంది. ఫస్టాఫ్ వైఫల్యం పుణేరి పల్టాన్ ఓటమిని ఖరారు చేసింది. ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన తెలుగు టైటాన్స్ క్వాలిఫయర్-2లోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.



# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్..

- ఆఖరి వన్డేలో ఇంగ్లాండ్ పై విజయం
- మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్

న్యూజిలాండ్ వన్డే టీమ్ చరిత్ర సృష్టించింది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. గత 42 ఏళ్లలో ఇంగ్లండ్‌ను క్లీన్ స్వీప్ చేయడం న్యూజిలాండ్‌కు ఇదే తొలిసారి. ఈ ఘనత సాధించిన కెప్టెన్‌గా మిచెల్ సాంట్నర్ చరిత్రకెక్కాడు. ఇంగ్లండ్‌తో శనివారం జరిగిన ఆఖరి వన్డేలో 2 వికెట్ల తేడాతో విజయం సాధించడం ద్వారా న్యూజిలాండ్ ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 222 పరుగులు చేసింది. జెమీ ఓవర్టన్(62 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. జోస్ బట్లర్(56 బంతుల్లో 7 ఫోర్లతో 38), బ్రైడన్ కార్స్(30 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 36) విలువైన పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో బ్లయర్ టిక్‌నర్(4/64) నాలుగు వికెట్లు తీయగా.. జాకోబ్ డఫ్ఫీ(3/56) మూడు వికెట్లు పడగొట్టాడు. జాక్ ఫోల్క్‌ర్స్ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం న్యూజిలాండ్ 44.4 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులు చేసి గెలుపొందింది. రచిన్ రవీంద్ర(37 బంతుల్లో 7 ఫోర్లతో 46), డారిల్ మిచెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 44) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో జెమీ ఓవర్టన్, సామ్ కరన్ రెండేసి వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ తీసారు. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను గెలిచిన న్యూజిలాండ్ 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది. న్యూజిలాండ్ చివరిసారిగా 1983లో జియోఫ్ హెూవర్త్ సారథ్యంలో ఇంగ్లండ్ వైట్ వాష్ చేసింది. మళ్లీ ఇన్నాళ్లకు మిచెల్ సాంట్నర్ సారథ్యంలో ఈ ఘనతను అందుకుంది.

# రోహన్ బోపన్న ఆటకు గుడ్ బై

- ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్

భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న ప్రొఫెషనల్ ఆటకు గుడ్‌బై చెప్పేశాడు. ఈ మేరకు తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. సుదీర్ఘమైన కెరీర్‌లో తనకు సహకరించిన వాళ్లందరికీ, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపాడు. ఆయనకు స్టార్ అథ్లెట్లు సానియా మీర్జా, పీవీ సింధు శుభాకాంక్షలు తెలిపారు. 2002లో అరంగేట్రం చేసిన బోపన్న దాదాపు రెండు దశాబ్దాలకు పైగా టెన్నిస్‌లో అనేక టోర్నమెంట్‌ల్లో ఆడాడు. కాగా, 45ఏళ్ల బోపన్న భారత్ తరపున గతేడాదే తరపున రిటైర్మెంట్ ప్రకటించినా, ఇప్పటిదాకా ప్రొఫెషనల్ గ్రాండ్‌స్లామ్ అలాగే %ాూా% టోర్నీల్లో కొనసాగాడు. ఇకపై టెన్నిస్‌కు సంబంధించి ఏ టోర్నీలోనూ బోపన్న బరిలో దిగడు.'ఇక గుడ్ బై, కానీ ఇది ముగింపు కాదు. మనకు జీవితాన్నిచ్చిన దానికి వీడ్కోలు ఎలా పలుకుతాం అయితే 20ఏళ్ల ఈ సుదీర్ఘమైన జర్నీ తర్వాత రాకెట్‌ను వదిలేస్తున్నాను. ఇది రాస్తున్నప్పుడు నా నా హృదయం బరువెక్కింది. భారత్‌లోని కూర్గ్ అనే చిన్న పట్టణంలో మొదలైన నా ప్రయాణం ప్రపంచంలోని అతిపెద్ద టోర్నీల దాకా సాగడం అవాస్తంగా అనిపిస్తాయి. టెన్నిస్ ఒక ఆట మాత్రమే కాదు. నేను ఓడిపోయినప్పుడు నా బలాన్ని, ప్రపంచం నన్ను అనుమానించినప్పుడు నమ్మకాన్ని ఇచ్చింది"నా తల్లిదండ్రులే నా హీరోలు. నాకు మద్దతుగా ఉంటూ వాళ్లు ప్రతీది ఇవ్వడం వల్లే నేను నా కల నెరవేర్చుకోగలిగాను. నా కోసం మీరు చేసిన త్యాగాలు నేను మర్చిపోను. నా సోదరి రష్మీ అన్నింటిలోనూ నన్ను ప్రోత్సహించింది. అలాగే నేను సాధించిన ప్రతి విజయం వెనుక నా భార్య సుప్రియ ప్రేమ, ఓర్పు ఉంది. నేను గత సంవత్సరాల్లో నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా కూతురు త్రిధ కోసమే ఆడాను. నువ్వు ప్రాణం' అని బోపన్న ఎమోషనల్ నోట్ పోస్టు చేశాడు. బోపన్న తన కెరీర్‌లో ఇప్పటి వరకూ 26 డబుల్స్ టైటిల్స్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను కూడా అందుకున్నాడు. దీంతో పాటు డబుల్స్‌లో నెం.1 ర్యాంక్ సాధించాడు. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఛాంపియన్‌గానూ చరిత్రకెక్కాడు. 2018 ఆసియా గేమ్స్‌లో బోపన్న- దివిజ్ జోడీ పురుషుల డబుల్స్‌లో గోల్డ్ మెడల్ దక్కించుకుంది. 2022 ఆసియా గేమ్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ బోపన్న పసిడి దక్కించుకున్నాడు. 2010, 2023లో యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్ వరకూ చేరుకున్నాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్‌లో మూడుసార్లు (2013, 2015, 2023), ఫ్రెంచ్ ఓపెన్‌లో (2022, 2024) రెండుసార్లు డబుల్స్ సెమీస్‌కు అర్హత సాధించాడు. 2012, 2016 ఒలింపిక్స్‌లోనూ బోపన్న భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అలాగే టెన్నిస్‌లో బోపన్న అందించిన సేవలకుగానూ భారత ప్రభుత్వం అతడికి 2018లో అర్జునా అవార్డు ప్రదానం చేసింది.



# రోహిత్, కోహ్లీల రికార్డులను బద్దలుకొట్టిన బాబర్

టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పాకిస్తాన్ స్టార్ బ్యాట్స్‌మెన్ బాబర్ ఆజం ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నారు. ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లోని రెండో మ్యాచ్‌లో 11 పరుగుల ఇన్నింగ్స్‌తో బాబర్ ఆజం అత్యధిక పరుగులు చేసిన పురుషుల టీ20 అంతర్జాతీయ బ్యాట్స్‌మెన్‌ల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. ఈ క్రమంలో ఆయన భారత దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను అధిగమించారు. పాకిస్తాన్ తరపున బాబర్ ఆజం టీ20లకు తిరిగి రావడం అంత గొప్పగా లేదు. అతను రెండు బంతుల్లో డకౌట్ అయి పెవిలియన్‌కు తిరిగి వెళ్ళాడు. అయితే, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని రెండో గేమ్‌లో ఈ కుడిచేతి బ్యాట్స్‌మెన్ కొంత సరిదిద్దుకున్నాడు. పాకిస్తాన్ 111 పరుగుల లక్ష్యాన్ని తొమ్మిది వికెట్లు చేతిలో ఉండగా, 41 బంతులు మిగిలి ఉండగానే ఛేదించడంతో 18 బంతుల్లో 11 పరుగుల అజేయమైన ఇన్నింగ్స్‌తో ఒక బౌండరీ సహాయంతో రీఎంట్రీ ఇచ్చాడు. ఈ 11 పరుగుల ఇన్నింగ్స్ కారణంగా బాబర్ ఆజం ఒక అద్భుతమైన టీ20 రికార్డును సాధించాడు. భారతదేశానికి చెందిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను అధిగమించాడు. బాబర్ 123 ఇన్నింగ్స్‌లలో 4234 పరుగులతో పురుషుల టీ20లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతను మాజీ భారత కెప్టెన్ రోహిత్‌ను అధిగమించాడు. రోహిత్ 151 ఇన్నింగ్స్‌లలో 4231 పరుగులు సాధించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 117 ఇన్నింగ్స్‌లలో 4188 పరుగులతో తన కెరీర్‌కు ముగింపు పలికాడు. బాబర్ (39.57) రోహిత్ (32.05) కంటే ఎక్కువ సగటును కొనసాగించినప్పటికీ అది విరాట్ (48.69) తో పోలిస్తే తక్కువ. ముగ్గురిలో రోహిత్ అధిక స్ట్రైక్ రేట్‌ను కొనసాగించాడు. బాబర్ డోనోవాన్ ఫెర్రేరా బౌలింగ్‌లో లాంగ్-ఆఫ్‌కు సింగిల్ తీసి అతను ఈ ఘనతను సాధించాడు.


# ప్రపంచ కప్ ఫైనల్ విజేతగా నిలిచేనా!



- ఓపెనింగ్ జోడీపైనే అందరి దృష్టి

మహిళల ప్రపంచ కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు, దక్షిణాఫ్రికా జట్టు మధ్య డివై పాటిల్ స్టేడియంలో తలపడనున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీమిండియా సెమీ-ఫైనల్‌లో చరిత్ర సృష్టించి ఫైనల్‌కు చేరుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 339 పరుగుల టార్గెట్ ఛేదించి టైటిల్ రేసులోకి వచ్చింది. మహిళల వన్డే చరిత్రలో ఇది అతిపెద్ద రన్ ఛేజింగ్. 7 సార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించి భారత మహిళల జట్టు 3వసారి వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికా జట్టు తొలిసారిగా ఫైనల్ చేరింది. టైటిల్ మ్యాచ్‌లో డివై పాటిల్ స్టేడియం పిచ్ రిపోర్ట్ కీలకం కానుంది. రెండు జట్ల ప్లేయింగ్ 11 మరియు మ్యాచ్ ప్రిడిక్షన్ వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. సెమీఫైనల్‌లో స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 127 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించింది. ఫైనల్‌లో కూడా మంధాన, హర్మన్ ప్రీత్, జెమీమా నుంచి ఈ తరహా ప్రదర్శనను ఆశిస్తున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ టోర్నమెంట్‌లో రెండు, మూడు మ్యాచ్ లలో కీలక ఇన్నింగ్స్ ఆడినా జట్టు ఓటమిపాలైంది. కానీ ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌లో 89 పరుగులు చేసి ఆకట్టుకుంది. ప్రతీకా రావల్ గాయంతో మరో ఓపెనర్ షెఫాలీ వర్మ భారత జట్టులోకి వచ్చింది. అయితే సెమీఫైనల్‌లో ఆమె కేవలం 10 పరుగులు చేసింది. ఫైనల్‌లో గెలవాలంటే షెఫాలీ, మరో ఓపెనర్ స్మృతి మంధానా మంచి ఓపెనింగ్ ఇవ్వడం చాలా ముఖ్యం. వీరిద్దరూ ఎటాకింగ్ బ్యాటింగ్ తో మొదలుపెట్టాలని అంతా ఆశిస్తున్నారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ బ్యాటింగ్ ఇన్నింగ్స్ ప్రారంభించనుంది. మొదట్లోనే భారత బౌలర్లు ఆమెను కట్టడి చేయాలి. లేకపోతే ఆమె సమస్యగా మారవచ్చు. సెమీఫైనల్‌లో ఆమె 169 పరుగులు చేసి చరిత్ర సృష్టించింది. రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ మొట్లోనే సఫారీల వికెట్లు తీస్తే ప్రయోజనం ఉంటుంది. నల్లపురెడ్డి చరణి పరుగులు నియంత్రించడంలో సక్సెస్ అవుతోంది. దీప్తి శర్మ సెమీఫైనల్‌లో ఎక్కువ పరుగులు ఇచ్చింది. కానీ టోర్నమెంట్‌లో ఆమె ఆల్ రౌండ్ ప్రదర్శనలో రాణించింది. డివై పాటిల్ స్టేడియం పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. కనుక ఫైనల్‌లో హై స్కోరింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. ఇక్కడ ఫాస్ట్ బౌలర్ల కంటే స్పిన్నర్లకు ఎక్కువ అనుకూలం. టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకోవచ్చు. మ్యాచ్ రోజు వర్షం పడే అవకాశం ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో సగటు స్కోరు 220. వాతావరణం విషయానికి వస్తే ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు 25 శాతం వర్షం పడే అవకాశం ఉంది. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచనున్నాయి. ఈసారి కొత్త ప్రపంచ ఛాంపియన్ జట్టును చూడనున్నాం. ఇరు జట్లు ఇప్పటివరకు ఒక్క టైటిల్ గెలవలేదు. హర్మన్‌ప్రీత్ కౌర్ అండ్ టీమ్ టైటిల్ గెలిచే అవకాశం 70 శాతం కంటే ఎక్కువ. భారత్ సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఇదే స్టేడియంలో ఓడించింది. హర్మన్‌ప్రీత్, జెమీమా అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. హెడ్ టు హెడ్ గణాంకాల్లో భారత్ ముందంజలో ఉంది. అయితే దక్షిణాఫ్రికాపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఆ జట్టు తొలిసారిగా ఫైనల్ ఆడుతోంది. దాంతో భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ ఛాంపియన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మహిళల ప్రపంచ కప్ 2025 ఫైనల్ నవంబర్ 2న డివై పాటిల్ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు స్టార్ట్ అవుతుంది. టాస్ 2:30 గంటలకు వేస్తారు. మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌లో, లైవ్ స్ట్రీమింగ్ జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఎంత పవర్‌ఫుల్ జట్టో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పురుషుల క్రికెట్ అయినా.. మహిళల్లో అయినా ఆస్ట్రేలియా జట్టుకు తిరుగు లేదు. పురుషుల క్రికెట్‌లో ఐసీసీ టైటిళ్లన్నీ గెలవడంతో పాటు అత్యధిక ట్రోఫీలు అందుకున్న ఏకైక టీమ్‌గా ఆసీస్ చరిత్ర సృష్టించింది. ఏకంగా 6 వన్డే ప్రపంచకప్(1987, 1999, 2003, 2007, 2015, 2023)ట్రోఫీలను గెలుచుకున్న ఆస్ట్రేలియా.. ఒక టీ20 ప్రపంచకప్ (2021), వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(2023), రెండు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ(2006, 2009), ఐసీసీ సూపర్ సిరీస్(2005)తో మొత్తం 11 టైటిళ్లను అందుకుంది.

# పెద్ది మూవీలో జాన్వీ లుక్స్ అదుర్స్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగు తోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మాఅనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్చి 27న విడుదల కానుంది. ' ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నెల 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సెర్ట్‌లోనే ఈ చిత్ర తొలి గీతాన్ని వినిపిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సామాజిక మాధ్యమాల వేదికగా సంకేతాలు అందించారు. ఆటలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. దీనికి రెహమాన్ సంగీతమందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# సల్మాన్‌తో దిల్‌రాజ్ మూవీ?



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మరోసారి భారీ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌తో పాటు దిల్ రాజు డ్రీమ్స్ అనే కొత్త విభాగం ద్వారా యంగ్ టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల 'గేమ్ ఛేంజర్' ,'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి ప్యాన్-ఇండియా స్థాయిలో ప్రాజెక్టులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో పలు బడా హీరోలతో సినిమాలు తెరకెక్కించే ప్రణాళికలో ఉన్న ఆయన, ఈసారి బాలీవుడ్ వైపు దృష్టి సారించారు. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో భారీ చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నారని వినికిడి. వీరిద్దరి కాంబినేషన్‌లో క్లాస్ టచ్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని టాక్. ఇప్పటికే సల్మాన్ ఖాన్ స్క్రిప్ట్‌ను విని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక, టెక్నీషియన్ల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక సల్మాన్ రెమ్యునరేషన్ విషయానికి వస్తే .. ఈసారి లాభాల్లో వాటా తీసుకోవడానికి అంగీకరించారని వార్తలు వస్తున్నాయి. దిల్ రాజు ఈ ప్రాజెక్ట్‌ను భారీ బ్జడెట్‌తో నిర్మించాలనుకుంటున్నారని, సినిమాని ప్యాన్-ఇండియా లెవెల్‌లో విడుదల చేయాలనే లక్ష్యంతో ఉన్నారని టాక్. గతంలో 'హిట్', 'జెర్సీ' వంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న దిల్ రాజు, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి మళ్లీ బాలీవుడ్ మార్కెట్‌లో తన ముద్ర వేయడానికి రెడీ అవుతున్నారు.



# విడుదలకు రెడీగా ఆంధ్ర కింగ్ తాలూకా

ఈ నెలాఖరున 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన.. భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి. మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలోని చిన్ని గుండెలో అంటూ సాగే మెలోడీ గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాటకు వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. మెర్విన్ సోలమన్, సత్య యామిని ఆలపించారు. ఈ పాటలో రామ్ - భాగ్యశ్రీల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. దీన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దానికి ఒకరోజు ముందుగానే ఈ నెల 27న తెరపైకి తీసుకొచ్చేందుకు నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.

# రోషన్ నటించిన ఛాంపియన్ టీజర్ విడుదల




నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛాంపియన్' స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. స్పోర్ట్స్ నేపథ్యంలో సాగనున్న ఈ సినిమాలో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపిస్తున్నారు. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్' టీజర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రోషన్, అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేయగా, తాజాగా రిలీజైన టీజర్ సినిమా స్థాయిని పెంచింది. 'ఛాంపియన్' కథ స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్‌లో నివసించే ఆర్మీ మాన్, ఫుట్‌బాలర్ అయిన మైఖేల్ సీ. విలియమ్స్ చుట్టూ తిరుగుతుంది. మైదానంలో ప్రత్యర్థులను సవాలు చేస్తూ తన ప్రతిభను ప్రదర్శించే ఈ యంగ్‌మ్యాన్‌కి ఇంగ్లండ్‌లో రాణి ఎలిజబెత్‌ను కలుసుకునే అవకాశం దక్కుతుంది. దేశం కోసం ఆడే అవకాశమొచ్చినా, అతని మనసు మాత్రం తన ప్రేయసి వద్దే ఉంటుంది. కానీ జీవితం అతనికి సవాళ్లు, భావోద్వేగాలు, యుద్ధం, ప్రేమ అన్నీ ఒకేసారి ఎదురుచూపిస్తుంది. ఫుట్‌బాలర్‌గా రోషన్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించాడు. హైదరాబాదీ యాసలో హిందీ మిక్స్ చేసిన అతని డైలాగ్ డెలివరీ చాలా న్యాచురల్‌గా, క్యారెక్టర్‌కి తగినట్టుగా ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో ఎనర్జీ, రొమాంటిక్ సీన్స్‌లో ఫినెస్, ఆత్మవిశ్వాసంతో కూడిన అటిట్యూడ్‌తో రోషన్ ఆకట్టుకున్నాడు. అనస్వర రాజన్ అందంగా కనిపించింది. వీరిద్దరి కెమిస్ట్రీ మనసుకు హత్తుకునేలా ఉంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం స్పోర్ట్స్, డ్రామా, యాక్షన్, రొమాన్స్, వార్ ? ఈ అన్ని ఎలిమెంట్స్‌ను అద్భుతమైన నారేషన్‌తో ఆకట్టుకున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్. మధీ వండర్‌ఫుల్ విజువల్స్‌ను క్యాప్చర్ చేయగా, మిక్కీ జె. మేయర్ మ్యూజిక్ టెన్షన్, ఎమోషన్ రెండింటినీ అద్భుతంగా బ్లెండ్ చేశారు. 'ఛాంపియన్' టీజర్ హిస్టరీ, స్పోర్ట్స్ డ్రామా, లవ్ స్టోరీ, అద్భుతమైన కంటెంట్‌తో సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం డిసెంబర్ 25న క్రిస్మస్‌కు విడుదల కానుంది.

# కథ పాతదే అయినా..జాతర కొత్తది

### - అభిమానులకు రవితేజ మాస్ జాతర

ఖాకీ కథలు రవితేజకు బాగా అచ్చొచ్చిన జానర్. 'క్రాక్', 'పవర్', 'విక్రమార్కుడు'.. ఇలా ఆయన కెరీర్‌లో పోలీస్ కథలతో కొట్టిన హిట్లు అనేకం. ఇప్పుడాయన 'మాస్ జాతర' కోసం రైల్వే పోలీస్‌గా మారారు. లక్ష్మణ్ భేరి (రవితేజ) నిజాయితీ గల రైల్వే పోలీస్. తన కళ్ల ఎదురుగా అన్యాయం జరిగితే.. అది తన పరిధిలోనిది కాకున్నా దాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మరీ న్యాయం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వరంగల్‌లో పని చేసే సమయంలో ఓ మంత్రి కొడుక్కి తనదైన శైలిలో బుద్ధి చెప్తాడు. ఆ తర్వాత తను అల్లూరి జిల్లాలోని అడవివరం రైల్వే స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతాడు. కొండల మధ్య ఉండే గిరిజన ప్రాంతాన్ని శివుడు (నవీన్ చంద్ర) శాసిస్తుంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులతో శీలావతి రకం గంజాయిని పండించి.. దాన్ని కోల్‌కతాకు స్మగ్లింగ్ చేస్తుంటాడు. లక్ష్మణ్ ఆ ఊర్లోకి అడుగు పెట్టడంతోనే శివుడికి ఎదురు వెళ్లడం మొదలు పెడతాడు. జిల్లా ఎస్పీ నుంచి మొదలు.. మొత్తం రాజకీయ వ్యవస్థ అండగా ఉన్న శివుడ్ని ఓ మామూలు రైల్వే ఎస్పై ఎలా అడ్డుకున్నాడు? అతని గంజాయి సామ్రాజ్యాన్ని ఎలా కూలదోశాడు?ఈ కథలో తులసి (శ్రీలీల), హనుమాన్ భేరి (రాజేంద్ర ప్రసాద్)ల పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ.కొత్త దర్శకులు అగ్రతారలతో జట్టు కట్టారంటే చాలు సినీప్రియుల్లో, అభిమానుల్లో ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. తమ అభిమాన కథానాయకుడ్ని ఎంత కొత్తగా తెరపై చూపిస్తారు..? అతనితో ఎలాంటి వినూత్నమైన కథ చెప్పిస్తారనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంటుంది. ఈ అంచనాల్ని దృష్టిలో పెట్టుకునే దర్శకుడు భాను భోగవరపు దీంట్లో రవితేజ పాత్రను వింటేజ్ ఎనర్జీతో పవర్‌ఫుల్‌గా తెరపై ఆవిష్కరించారు. రవితేజ నుంచి కోరుకునే ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ యాక్షన్ అంశాల్ని మేళవిస్తూనే ఆయన ఒకప్పటి బెంచ్ మార్క్ హిట్స్‌ను గుర్తు చేసుకునేలా కొన్ని హైమూమెంట్స్‌ను అందించే ప్రయత్నం చేశారు. అయితే కథలో కొత్తదనం కనిపించలేదు. రవితేజ ఇప్పటికే ఇలాంటి రొటీన్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చాలా చేసేశాడు కదా అని ప్రేక్షకుడికి అనిపిస్తుంది. రవితేజలోని హైఎనర్జీని రుచి చూపిస్తూ మంచి యాక్షన్ సీక్వెన్స్‌తో ఆయన పాత్రను తెరకు పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ఆ వెంటనే తన కుటుంబ నేపథ్యాన్ని.. తాతతో ఉన్న అనుబంధాన్ని.. పెళ్లి కాకపోవడానికి వెనకున్న కారణాల్ని ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశారు. శివుడిగా నవీన్‌చంద్ర విలనిజాన్ని.. తన గంజాయి స్మగ్లింగ్ దందాను పరిచయం చేస్తూ కథలో సంఘర్షణకు బీజం వేసిన విధానం ఫర్వాలేదనిపిస్తుంది. హీరో అడవివరంకి ట్రాన్స్‌ఫర్ అవడం.. అక్కడ తనకు శివుడి గ్యాంగ్‌కు మధ్య జరిగే చిన్నపాటి గొడవలతో కథ కాస్త వేగం పుంజుకుంటుంది. శివుడు గంజాయి స్మగ్లింగ్ కోసం రైల్వేని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకోవడం.. దాన్ని అడ్డుకునేందుకు హీరో రంగంలోకి దిగడంతో అసలు కథ మొదలవుతుంది. ఈ క్రమంలో ఊరి ప్రజలతో హీరో చేసే యాక్షన్ సీక్వెన్స్ థ్రిల్ పంచుతుంది. హీరోని చంపేందుకు శివుడి మామ రంగంలోకి దిగడం.. ఈ క్రమంలో అడవిలో వాళ్ల మధ్య వచ్చే ఫైట్ సీక్వెన్స్ రోమాంచితంగా ఉంటుంది. శివుడి ఇంటికొచ్చి హీరో చేసే విధ్వంసం కూడా థ్రిల్ పంచుతుంది. ప్రీ క్లైమాక్స్‌లో రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్‌గా హనుమాన్ భేరి పాత్రలో రాజేంద్రప్రసాద్ చేసే యాక్షన్ హంగామా అలరిస్తుంది. ఈ సినిమాని పూర్తిగా రవితేజ తన భుజాలపై మోశారు. వింటేజ్ స్టైల్, శ్వాగ్, ఎనర్జీతో లక్ష్మణ్ భేరిగా తెరపై ఆయన చేసిన సందడి.. ÷ట్స్, పాటల్లో చూపించిన హుషారు.. తనదైన కామెడీ టైమింగ్.. అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. శ్రీలీల రవితేజతో కలిసి ఆమె వేసిన హుషారైన స్టెప్పులు మెప్పిస్తాయి. అభిమానులు మెచ్చేలా రవితేజను ఎనర్జిటిక్‌గా చూపించడంలో సఫలమయ్యారు.





# ఆదిసాయికుమార్ శంబాల ట్రైలర్ విడుదల

ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'శంబాల'. మిస్టికల్ థ్రిల్లర్‌గా.. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. అర్చన అయ్యర్, శ్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ ముఖ్యపాత్రల్ని పోషించారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన యుద్ధమే ఈ కథకు మూలం అంటూ సాయికుమార్ వాయిస్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇది సైన్స్ ఊహకు అందనిది అనే డైలాగులు ఆసక్తి కలిగిస్తున్నాయి.